సాక్షి e-paper

Print Email Clip Article Image View

Rate This Article

# మహిళలు వంటింటికే పరిమితం కావొద్దు

రేపల్లెరూరల్, న్యూస్‌లైన్: మహిళలు వంటింటికే పరిమితం కాకుండా ఆర్థికాభివృద్ధి చెందేందుకు స్వయం ఉపాధి రంగాలపై ఆసక్తి చూపాలని సినీరచయిత పరుచూరి వెంకటేశ్వరరావు తెలిపారు. మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఎంపీపీ హాలులో ఫ్యాషన్ డిజైనింగ్‌పై మహిళలకు జరుగుతున్న కుట్టు మిషన్ శిక్షణ తరగతులను గురువారం ఆయన పరిశీలించారు. శిక్షణ పూర్తిచేసుకున్న పేదమహిళలు పి.రజని, కె.రాజకుమారిలకు ఉచితంగా కుట్టుమిషన్లు అందజేశారు. సభకు ఎంపీపీ ఉపాధ్యక్షుడు డాక్టర్ వేజళ్ళ ప్రకాశరావు అధ్యక్షత వహించారు. సినీరచయిత వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్వయం ఉపాధి రంగాల్లో మహిళలకు కుట్టు శిక్షణ ప్రాముఖ్యమైనదన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు అవసరమైతే ఉపాధి అవకాశాన్ని కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. సభలో కుట్టు శిక్షణ కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ పార్వతి మాట్లాడుతూ ఏడాదిన్నర నుంచి మహిళలకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు ఆరు బ్యాచ్‌ల ద్వారా 250 మందికి శిక్షణ ఇచ్చామన్నారు. ప్రతి బ్యాచ్‌లో శిక్షణ పూర్తిచేసుకున్న ప్రతిభావంతులైన పేద మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందిస్తున్నామన్నారు. నేర్చుకున్న వృత్తిని వృథాచేయకుండా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో చర్చించి యూనిఫామ్‌లను కాంట్రాక్ట్ తీసుకుని మహిళలకు ఉపాధి కల్పిస్తున్నామని చెప్పారు. అనంతరం కుట్టు మిషన్లు అందజేశారు. ఎంపీపీ సభ్యులు డాక్టర్ ప్రభాకరరావు, జి.రాజశేఖర్, జి.బాపారావు, శిక్షకురాలు డి.మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరుచూరి వెంకటేశ్వరరావు

- స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి
- సినీరచయిత పరుచూరి వెంకటేశ్వరరావు
- కుట్టుమిషన్ శిక్షణ తరగతుల సందర్శన, మిషన్ల పంపిణీ